క్లుప్తంగా

శివలింగానికి జలాభిషేకం

మద్దికెర : మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి దాదాపు 6 కి.మీ దూరంలో ఉన్న దొనపాడు శివాలయంలో వర్షం కోసం పూజలు నిర్వహించి ఆవరణలోని శివలింగానికి జలాభిషేకం చేశారు. ఉదయం స్వామివారికి పూజలు చేశారు. యువకులు ఉపవాసదీక్ష చేపట్టి శివలింగానికి 101 బిందెలతో జలాభిషేకం నిర్వహించి పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు



ఎల్లార్తి దర్గాల దర్శనానికి వచ్చిన భక్తులు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం సందర్భంగా ప్రత్యేక ఫాతెహాలు జరిగాయి. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయి బాబాఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

మద్దికెర : మండల కేంద్రం మద్దికెరలో ప్రవాస భారతీయులు ప్రేమసాగర్‌రెడ్డి, వెంకమ్మరెడ్డి ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. రెండవ రోజు గురువారం కొనసాగిన వైద్యశిబిరాన్ని వారు పరిశీలించారు. పేదల సౌకర్యార్థం ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి

వెల్దుర్తి: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ రెడ్డిపోగు భాస్కర్ ఆధ్వర్యంలో వెల్దుర్తి పట్టణ పరిధిలోని హైవే -44పై రాస్తారోకో నిర్వహించారు. డోన్ గేట్ల వద్ద జంక్షన్‌లో జరిపిన రాస్తారోకోతో ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఆందోళనకారుల రాస్తారోకో విరమింపజేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రత్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆస్పరిలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీఓ నిర్మలాదేవికి వినతి పత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.26వేలువేతనం ఇవ్వాలన్నారు.

మండల అభివృద్ధికి నివేదికలు సిద్ధం చేయండి

చిప్పగిరి: మండల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై శాఖల వారీగా నివేదిక సిద్ధం చేయాలని ఎంపీడీఓ సీవీ కొండయ్య అధికారులను ఆదేశించారు. నీతి ఆయోగ్ రూపొందించిన నివేదికలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా చిప్పగిరి మండల ఎంపికైనందున అభివృద్ధి చర్యలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, ఐసీడీఎస్, వెలుగు తదితర శాఖల అధికారులు నివేదికను సమర్పించారు. మిగిలిన శాఖల అధికారులు ఈ నెల 23 లోపు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం నాగార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం

దేవనకొండ : మండలకేంద్రమైన దేవనకొండలోని అయ్యప్పస్వామి దేవాలయంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాయలసీమ జోనల్ ధర్మ ప్రచారక్ ఈశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. సమరసత సేవా ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సంస్థ అభివృద్ధి గురించి 8 సంవత్సరాలు పూర్తి చేసుకుని హిందూ ధర్మ ప్రచారం చేసి మతమార్పిడులను ఆపిందన్నారు. ఎస్సీ, ఎస్టీ మత్స్యకార కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ఆర్థిక సహకారంతో దేవాలయ నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ధర్మ ప్రచారకులు నాగేంద్ర, మండల కన్వీనర్ రంగాచారి, అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త వేణుమారాజ్, సబ్ డివిజన ధర్మ ప్రచార వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దమరివీడు ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎం రామలింగం ఆధ్వర్యంలో గురువారం గురుజాడ అప్పారావు 163వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, పెద్ద ఖాజాన్న, నరసప్ప, పురుషోత్తం, జయలత తదితరులు పాల్గొన్నారు.

జై బోలో గణేష్ మహరాజ్‌కీ

- సంప్రదాయబద్ధంగా వినాయక నిమజ్జనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



వెల్దుర్తిలో గణనాథుల శోభాయాత్ర



గణనాథుడిని ఊరేగింపు



ఎమ్మిగనూరులోని దిగువ కాలువలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



హంద్రీనీవా కాలువలో గంగమ్మ ఒడికి చేరుతున్న గణనాథులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం గురువారం కనుల పండుగా జరిగింది. వినాయక ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు వినాయక విగ్రహాలకు కడసారి పూజలు నిర్వహించారు. జై బోలో గణేష్ మహరాజ్‌కీ అంటూ ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఊరేగింపులో భాగంగా పలువురు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పట్టణంలో 180కి పైగా ప్రతిష్ఠించిన వినాయకుల నిమజ్జనం సాయంత్రం నుంచి రాత్రి 10గంటల వరకు కొనసాగింది. ఉత్సవాల ముగింపు రోజున మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఎస్పీ సీతారామయ్య, తహసీల్దార్ ఆంజినేయులు పూజలు చేసి నిమజ్జన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం సోమప్ప సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్, ఓంశాంతి సర్కిల్, ఆదోని బైపాస్ సర్కిల్ మీదుగా ఎల్లెల్సీ కాలువ వరకూ శోభాయాత్ర కొనసాగింది. కాలువలో భారీ క్రేన్లు పెట్టి గణనాథులను నిమజ్జనం చేశారు. సోమప్ప సర్కిల్‌లో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ ఆకృతులతో పేల్చిన బాణసంచా ఆకట్టుకున్నాయి.

గంగమ్మ ఒడిలోకి గణనాథుడు

వెల్దుర్తి: మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన 50కు పైగా గణనాథులను గురువారం గంగమ్మ ఒడికి చేర్చారు. నిర్వాహకులు మధ్యాహ్నం పూజాది కార్యక్రమాలు నిర్వహించి పట్టణ పురవీధుల గుండా ఊరేగిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గణనాథులను సాగనంపారు. లద్దగిరి రోడ్డులోని హంద్రీనీవా కాలువలో నిమజ్జనం గావించారు. ఊరేగింపులో చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకోగా పోలీసులు శాంతిపజేసి ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దిశ సీఐ కళావెంకటరమణ, వెల్దుర్తి, కృష్ణగిరి ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, సురేశ్ బందోబస్తు నిర్వహించారు.

జిల్లాస్థాయి పోటీలకు తెర్నెకల్ విద్యార్థులు



విద్యార్థులతో సర్పంచ్ అరుణ్‌కుమార్, హెచ్ఎం జ్యోతి

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం జ్యోతి, తెర్నెకల్ సర్పంచ్ మొగతాల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గురువారం స్థానిక పాఠశాలలో అభినందించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, పీఈటీ వీణ, గాదెరోషన్న, మధుసూదన్‌రెడ్డి, సోషల్ టీచర్‌లను సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మద్దికెర: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాజశేఖర్, హనుమేష కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ నరసింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో చాలీచాలనీ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు పరిధి మార్చేందుకు చర్యలు తీసుకోండి



న్యాయశాఖ కార్యదర్శి సత్యప్రభాకర్‌రావుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పత్తికొండ కోర్టు పరిధిలో ఉన్న గోనెగండ్ల మండలాన్ని ఎమ్మిగనూరు పరిధిలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి సత్య పభాకర్‌రావును ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కోరారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో న్యాయశాఖ కార్యదర్శిని ఎమ్మెల్యే కలిశారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగి ఏళ్లు గడుస్తున్నా కోర్టు పరిధిని మాత్రం మార్చలేదన్నారు. దీంతో గోనెగండ్ల మండల వాసులు కేసులు, కోర్టు పనులపై పత్తికొండకు వెళ్లాలంటే వ్యయప్రయాసాలతో దాదాపు 50కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సివస్తుందని వివరించారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి హామి ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

తీరనున్న తాగునీటి కష్టాలు



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ టీ. నసురుద్దీన్

గోనెగండ్ల : జలజీవన్ మిషన్‌తో గోనెగండ్లలో తాగునీటి సమస్య తీరుతుందని ఎంపీపీ టీ. నసురుద్దీన్ తెలిపారు. మండల కేంద్రం గోనెగండ్లకు జలజీవన్ మిషన్ పథకం కింద రూ.2.50కోట్లు మంజూరయ్యాయి. దీంతో స్థానిక చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దేవాలయం ఆవరణలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డితో కలిసి రూ.30లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద ఇంటింటికీ మంచినీటి కుళాయిను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో భాగంగానే గోనెగండ్లలో 90వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకులను మూడు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ కో ఆప్షన్ మెంబర్ బందెనవాజ్, సర్పంచ్ హైమవతి, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ రఫీ, నాయకులు గోవింద్, కొలుట్లయ్య స్వామి, ఓబులయ్య స్వామి, పద్మనాభం, బగిలి ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక రైతు మృతి



మహబూబ్‌బాషా (ఫైల్)

దేవనకొండ : అప్పుల బాధ తాళలేక మూడురోజుల క్రితం పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని గుండ్లకొండ మజరా గ్రామమైన ఎం.కె.కొట్టాలకు చెందిన జింకల మహబూబ్‌బాషా(38) కోలుకోలేక గురువారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి తొమ్మిది ఎకరాల పొలం ఉండగా అందులో ఐదు ఎకరాల్లో మిరప, నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశాడు. ఇందుకు రూ.6 లక్షల దాకా అప్పు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రతిరోజూ అప్పులు ఎక్కువై పోయాయని బాధపడేవాడని, అప్పులను తీర్చలేక పురుగుమందు తాగాడని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య చందాలి పర్వీన్ ఉన్నారు. దేవనకొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దమరివీడు మాజీ సర్పంచ్ మృతి

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి(78)బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి గురువారం ఉదయం పెద్దమరివీడు గ్రామానికి వెళ్లి వెంకట్ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఇసుక టిప్పర్ బోల్తా

నందవరం : మండల పరిధిలోని ముగతి గ్రామంలోని వైఎస్సార్ సర్కిల్‌లోని జాతీయ రహదారి 167లో మలుపు వద్ద టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. కౌతాళం మండలం గుడికంబాలి ఇసుక రీచ్ నుంచి ఇసుక నింపుకుని మంత్రాలయం మీదుగా కర్నూలుకు వెళ్లుతుండగా బుదవారం రాత్రి ఘటన చోటుచేసుకుంది. ఇందులో టిప్పర్ డ్రైవర్ శంకర్ గౌడ, క్లీనర్ నరేష్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దేవనకొండ : మండలంలోని ఈదుల దేవరబండ గ్రామ సమీపంలో గురువారం రాత్రి కారు-బైక్ ఢీకొన్న ఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పి.కోటకొండకు చెందిన రంగస్వామి, జిల్లెడబుడకల గ్రామానికి చెందిన రంగన్న బైకుపై పి.కోటకొండకు వెళ్తుండగా కర్నూలు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. క్షతగాత్రులను అటుగా వెళ్తున్న వారు దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు.

అర్హులందరికీ 'జలకళ'

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం బీడు భూముల్లో పంటలు సాగు చేసుకునేందుకు అమలు చేసిన జలకళ రెండవ విడతలో అర్హులైన వారందరికీ బోర్లు వేయడం జరుగుతుందని ఏపీడీ పద్మావతి అన్నారు. గురువారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం రెండో విడతలో బోర్లు మంజూరు చేసిన వెంటనే పొలాలలో బోర్లు వేయిస్తామని చెప్పారు. అలాగే మోటారు, విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆలూరు: ఖరీఫ్ సాగుకు సరైన సమయంలో వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయాలని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భూపేష్ కోరారు. స్థానిక సిద్దేశ్వర కాలనీలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన వ్యవసాయ కార్మికులు,రైతు కూలీలు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కరువు వల్ల వ్యవసాయ పనులు లేకపోవడంతో ప్రభుత్వం ఉ పాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాల ని కోరారు. రంగన్న,బాషా పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలి

హొళగుంద: గ్రామంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు పని చేయాలని ఎంపీడీఓ సుభాషిణి సూచించారు. గురువారం నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ డెవలప్‌మెంట్ పథకం కింద ఎంపికైన ఎల్లార్తి గ్రామంలో సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, టీచర్ల కొరత, విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన, రైతుల సంక్షేమం, పొదుపు మహిళలకు స్వయం ఉపాధి కల్పన ఇలా అనేక అంశాల పై ఆయా శాఖల అధికారులకు సూచనాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్కేగిరి, పీఆర్ ఏఈ సోమప్ప, ఏఓ ఆనంద లోకదళ్, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి



మొక్కలను పరిశీలిస్తున్న ఏపీడీ పక్కీరప్ప

ఆలూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ పక్కీరప్ప సిబ్బందిని ఆదేశించారు. చిప్పగిరి మండలం నేమకల్లు, సంగాల, బెల్డోణ, ఆలూరు తదితర గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన మొక్కలను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాలకు చెందిన ఏపీఓ, టీసీ, ఈసీ, ఎఫ్ఏలు, సీనియర్ మేట్లు గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు పనులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రాజు కుటుంబాన్ని ఆదుకుంటాం

వెల్దుర్తి: వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ కుంటలో మునిగి మృతి చెందిన రాజు కుటుంబాన్ని ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించగా వారు ఆసుపత్రి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని తల్లితండ్రులు మద్దయ్య, నాగమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు.

ప్రమాదంలో యువకుడి మృతి

గుత్తి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం గుమ్మనూరు కొట్టాలకు చెందిన శ్రీనివాసులు (19) వ్యక్తిగత పనిపై గురువారం గుంతకల్లుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గుంతకల్లు మండలం కమ్మ కొట్టాల వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక బైక్ అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తించిన స్థానికులు గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు అంబులెన్స్‌లో తీసుకెళుతుండగా మార్గమధ్యంలో గుత్తి వద్ద మృతి చెందాడు. ఘటనపై గుంతకల్లు వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రచార యాత్రను విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50సంవత్సరాలైన సందర్భంగా శుక్రవారం నుంచి పత్తికొండలో ప్రారంభమయ్యే ప్రచార యాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా అధ్యక్షుడు యల్లప్ప పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఇచ్చాపురం నుంచి విజయవాడ వరకు ఒక ప్రచార జాత ప్రారంభం కానుండగా... మరొకటి హిందూపురం నుంచి ప్రారంభమై శుక్రవారం పత్తికొండకు చేరుకుంటుందన్నారు. యాత్రలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి

దేవనకొండ: దళిత బడుగు బలహీనవర్గాలు, పేదల దగ్గర ఉన్న భూములను పెద్దలకు కట్టబెట్టేలా ఉన్న అసైన్‌మెంట్ చట్ట సవరణ ఆర్డినెన్ బిల్లును వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వీరశేఖర్ మాట్లాడుతూ పేదలు అనుభవంలో ఉన్న భూములను ఇతరులకు విక్రయించుకోవచ్చు అన్న చట్ట సవరణ ద్వారా పేదల దగ్గర ఉన్న భూములు రియల్ ఎస్టేట్, రాజకీయ పెద్దల చేతుల్లోకి వెళతాయన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అశోక్, రంగన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–పాస్ మిషన్ ద్వారా ఎరువులు విక్రయించాలి



నందవరంలో ఎరువుల దుకాణంలో ఈపాస్ మిషన్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ ఖాద్రి

నందవరం: రైతులకు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని ఏడీఏ మహ్మద్ ఖాద్రి ఎరువుల దుకాణాదారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో కిసాన్ మాల్, మండల పరిధిలోని నాగలదిన్నెలో వెంకటసాయి, న్యూ నవీన్ ఫర్టిలైజర్స్ అండ్ కోరమాండల్ ఎరువుల దుకాణాలలో ఏఓ మత్రి స్రవంతితో కలిసి తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎరువుల గోడెన్‌లో స్టాక్‌లకు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఈపాస్ మిషన్‌లో ఉన్న స్టాక్‌కు, గోడౌన్లలో ఉన్న స్టాక్‌కు సరిచూసుకోవాలన్నారు. అనంతరం నాగలదిన్నెలోని ఆర్‌బీకే 1, 2లను పరిశీలించి పంట నమోదుతో పాటు ఈకేవైసీ వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేంద్ర గౌడ, వీఏఏలు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్లు

చిప్పగిరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కర్నూలు విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్ వైద్య నిపుణులు గొంతు, రొమ్ము, గర్భసంచి, ఊపిరితిత్తులు, నోటి తదితర క్యాన్సర్ లకు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. మొత్తం 80 మందికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి వ్యాధి నిర్ధారణ అయినట్లు, మరో 10 మందికి లక్షణాలు గుర్తించినట్లు మెడికల్ ఆఫీసర్ జమీల్ అహమ్మద్ తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్లు చంద్రశేఖర్, వీరేంద్ర, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు, పంచాయతీ అధికారులకు సన్మానం



హొళగుందలో ఎస్ఐని సన్మానిస్తున్న దృశ్యం

హొళగుంద: మండలంలో బుధవారం వినాయక నిమజ్జనం, పండుగ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన పోలీసు, పంచాయతీ, విద్యుత్ శాఖాధికారులను గురువారం విశ్వ హిందు పరిషత్, భజరంగదళ్ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరి రాజశేఖర్, సర్పంచ్ తనయుడు పంపాపతితో పాటు విద్యుత్ తదితర శాఖలధికారులను పూలు, శాలువలతో సన్మానించారు.

పౌష్టికాహార లోపాలు రానివ్వద్దు



ఆలూరు- 4 అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ లలిత

ఆలూరు: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార లోపాలు తలెత్తకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు చూసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ లలిత ఆదేశించారు. గురువారం ఆలూరులోని 4వ, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. శుచి, రిచికరంగా వంట వండాలని సూచించారు. పాలు, ఆకుకూరలు, కూరగాయాలు, ఉడికించిన గుడ్లు అందజేయాలన్నారు.

వినాయక చవితి వేడుకల్లో అపశృతి

- జనంపైకి దూసుకెళ్లిన బొలెరో
- రాజు అనే యువకుడు మృతి
- ఒకరి పరిస్థితి విషమం
- మరో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ లక్ష్మీ, ధనుష్



ప్రాణాపాయ స్థితిలో బాలుడు మనోజ్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో గురువారం రాత్రి వినాయక చవితి వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. వినాయకుడిని తీసుకెళ్లే బొలెరో వాహనం ప్రజలపైకి దూసుకెళ్లడంతో రాజు(16), బాలుడు మనోజ్, దనూష్, రమేష్, వృద్ధురాలు లక్ష్మీలకు గాయాలయ్యాయి. వివరాలు... ఎస్ఎంటీ కాలనీలో రాత్రి వినాయక చవితి వేడుకల్లో భాగంగా బోలెరో వాహనంపై వినాయకుడి విగ్రహాన్ని ఎక్కించారు. డీజె ముందు కాలనీ వాసులు డ్యాన్సులు వేస్తుండగా డ్రైవర్ వాహనం ఆఫ్ చేసి, బండికి తాళాలు తీసుకెళ్లకుండా భోజనానికి వెళ్లాడు. ఇంతలో కాలనీకి చెందిన ఓ యువకుడు వాహనం తాళం ఆన్ చేయటంతో వేగంగా ముందు ఉన్న ప్రజల్లోకి దూసుకెళ్లింది. ఆ యువకుడు భయంతో బ్రేక్ తొక్కుండా ఎక్స్‌లైటర్ తొక్కడంతో వినాయకుడి ముందు నృత్యం చేస్తున్న రాజు తలపై వాహనం టైర్లు ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ప్రమాదంలో అన్నదమ్ములు ధనుష్, మనోజ్(7), రమేష్‌లతో పాటు వృద్ధురాలు లక్ష్మీలను వాహనం ఢీ కొట్టింది. గాయపడ్డ ఐదుగురిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రాజు, మనోజలను కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో రాజు మృతి చెందాడు. మనోజ్ పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెబుతున్నారు. గాయపడ్డ లక్ష్మీ, ధనుష్‌లు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మృతుడు రాజు బంధులవులు సరైన వైద్యం అందించలేదని ఆసుపత్రి వద్ద సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.